హరహర మహాదేవ శంభోశంకర

- శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- తెల్లవారు జామునుంచే విశేష పూజలు, అభిషేకాలు



ప్రకాశం బ్యారేజీ వద్ద పిండప్రదానాలు చేస్తున్న భక్తులు



లెనిన్ సెంటర్‌లో మహా శివలింగానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు



కాశీవిశ్వేశ్వరస్వామికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు



శివరామ కృష్ణ క్షేత్రంలో శివయ్య దర్శనం చేసుకుంటున్న భక్తులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మహాశివరాత్రి పర్వదినాన హరహర మహాదేవ శంభోశంకర నామస్మరణతో శైవక్షేత్రాలు మార్మోగాయి. తెల్లవారు జాము నుంచే ఆలయాల్లో భక్తులు పోటెత్తారు. మహా శివరాత్రిని పురస్కరించుకుని శనివారం శివాలయాలన్ని ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. లెనిన్‌సెంటర్‌లోని ఓం షిర్డీ నాగసాయిబాబా, నాగమానసాదేవి అమ్మ వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొని మహా శివలింగానికి విభూది సమర్పించారు. భారీ అన్నసమారాధన జరిగింది. మహిళలకు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చీరల పంపిణీని ఎమ్మెల్యే విష్ణు ప్రారంభించారు.

కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణదేవస్థానంలో..

గవర్నర్‌పేటలోని చల్లపల్లి బంగ్లా సమీపంలో వేంచేసి ఉన్న శ్రీ కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానం భక్తజనంతో పోటెత్తింది. తెల్లవారు జామునుంచే పెద్ద సంఖ్యలో భక్తులు శివయ్యను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి మహాశివుడిని ప్రసన్నం చేసుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానంలో నిర్వహించిన సర్వదేవతా హోమాలు, పూర్ణాహుతిలో ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొన్నారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. అన్ని ఆలయాల వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవదాయ, రెవెన్యూ, పోలీస్ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. శివరాత్రికి చేసే ఉపవాసానికి, జాగరణకు విశేష ప్రాధాన్యం ఉందని.. జాగారం సమయంలో శివపంచాక్షరి మంత్రంతో ధ్యానం చేయడం వల్ల ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. పరమశివుని తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ సాంబశివరావు, డివిజన్ కోఆర్డినేటర్ ఒగ్గు విక్కీ, నాడార్స్ శ్రీను, నళిని, వడ్డే వాసు, భక్తులు పాల్గొన్నారు.

బారులు తీరిన భక్తులు..

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్, ముత్యాలంపాడులోని శ్రీపార్వతీసమేత రామలింగేశ్వరస్వామి దేవాలయం, పప్పులమిల్లు సెంటర్‌లోని శ్రీ ఉభయ రామలింగేశ్వరస్వామి దేవాలయం, సత్యనారాయణపురం శివకేశవ దేవాలయాల్లో తెల్లవారు జాము నుంచే అభిషేకాలు, పూజలు జరిగాయి. విశేష సంఖ్యలో భక్తులు స్వామి వార్లను దర్శించుకున్నారు. ముత్యాలంపాడు శ్రీ పార్వతీసమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో స్వామి వారిని ఎమ్మెల్యే విష్ణు దర్శించుకుని పూజలు చేశారు. అన్న ప్రసాద వితరణను ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక పెనుమత్స శిరీష, వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు పెనుమత్స సత్యం, సామంతపూడి చిన్నా, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. రామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు డీవీఎస్ రాజు, డి.శివరామరాజు, మండలపర్తి సత్యశ్రీహరి, బడేటి ధర్మారావు, ఐఎస్ఎన్ రాజు పర్యవేక్షించారు. రాత్రి 10 గంటల నుంచి మహన్యాసపూర్వక ఏకరుద్రాభిషేకం తెల్లవారురుఝామున 3గంటలకు శివపార్వతుల కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరుపుతామని శ్రీధర్మపరిషత్ వ్యవస్థాపకుడు అవ్వాహేమసుందర వరప్రసాద్ తెలిపారు. ముత్యాలంపాడు శ్రీ కోదండ రామాలయంలో పాదరసలింగ పీఠాధిపతి శివతేజోనంద స్వామిజీ, శివలావణ్య మాతాజీ భక్తులకు రుద్రాక్షలు, అమ్మవారి పసుపు తాడు పంపిణీ చేశారు.

ఎమ్మెల్యే విష్ణు ప్రత్యేక పూజలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురం శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి వారి దేవస్థానం శివనామస్మరణతో మార్మోగింది. తెల్లవారు జాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే విష్ణు కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. ముందుగా గోమాతకు పూజలు చేశారు. అనంతరం కైలాసనాథునికి సుగంధద్రవ్యాలతో అభిషేకం చేశారు. స్థానిక కార్పొరేటర్ శర్వాణి మూర్తి, ఆలయ చైర్మన్ కొల్లూరు రామకృష్ణ, ఈఓ యడ్లపల్లి సీతారామయ్య, నాయకులు రామలింగమూర్తి, దోనేపూడి శ్రీనివాస్, సనత్, శనగపూడి శ్రీనివాస్, చాంద్, నరసింహామూర్తి పాల్గొన్నారు.

సర్వం శివమయం

విజయవాడ కల్చరల్: దుర్గాపురంలోని రామకోటి ప్రాంగణంలో ఉన్న శివాలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 12 గంటల పాటు నిర్విరామంగా లక్ష బిల్వార్చన, మహాలింగార్చాన, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. దేవాలయ ధర్మాధాకారి హనుమత్ ప్రసాద్ మాట్లాడుతూ పరమశివుకు ప్రీతి పాత్రమైనది శివరాత్రి పర్వదినమని సర్వదేవతలు శివారాధనలోనూ శివనామ స్మరణతోనూ తరిస్తారని తెలిపారు.

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని శ్రీషిర్డీ సాయిబాబా మందిర ఆవరణలో వేంచేసి ఉన్న శ్రీకాశీ అన్నపూర్ణ సహిత విశ్వేశ్వరస్వామి వారికి భక్తులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా పంచామృతాలతో, వివిధ పళ్ల రసాలతో, బిల్వాలతో స్వామి వారికి అభిషేకాలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు వైభవంగా నిర్వహించారు. విశేష అలంకరణలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం 108 మంది భక్తులతో గురు చరిత్ర పారాయణం భక్తిశ్రద్ధలతో జరిగింది.

కనులపండువగా కల్యాణోత్సవం



ఆలయ ధర్మకర్త అద్దంకి సత్యనారాయణ ప్రసాద్, ఉప్పులూరి శేషప్రసాద్ శర్మ పర్యవేక్షించారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): రామకృష్ణాపురం శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి వారి దేవాలయంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. ఉదయం 7.30 గంటలకు స్వామి వారికి మహాలింగార్చన, సాయంత్రం 7.30 గంటలకు వేదపండితులచే కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు కళ్యాణ ఉత్సవంలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను



భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే విష్ణు



రుద్రాక్షలు పంపిణీ చేస్తున్న శివతేజోనంద స్వామీజీ



కాశీవిశ్వేశ్వర స్వామి వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే విష్ణు



గురుచరిత్ర పారాయణం చేస్తున్న భక్తులు

క్లుప్తంగా

స్టెల్లాలో ఎన్‌సీసీ ప్రాక్టికల్స్



పటమట(విజయవాడతూర్పు): స్టెల్లాలో ఎన్‌సీసీ ప్రాక్టికల్ పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు నగరానికి చెందిన వివిధ కళాశాలలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్లు డ్రిల్, ఫీల్డ్ క్రాఫ్ట్, బ్యాటిల్ క్రాఫ్ట్ పరీక్షలకు హాజరయ్యారు. ఈ పరీక్షలకు ప్రిసీడింగ్ అధికారులుగా లెఫ్టినెంట్ కర్నల్ తస్వీర్, కర్నల్ సౌరభ్ ముఖర్జీ, కర్నల్ సురేంద్రన్ వ్యవహరించారు. ఎన్‌సీసీ 4 ఆంధ్ర గరల్స్, 17 ఆంధ్రాబెటాలియన్, 1ఈఎంఈ బెటాలియన్ (ఎలక్ట్రానిక్–మెకానికల్ ఇంజినీరింగ్)కు చెందిన సుమారు 500 మంది కేడెట్లు పరీక్షలకు హాజరయ్యారు. ఈ పరీక్షలను ఆడమ్ ఆఫీసర్ కనకలత, జూనియర్ కమిషన్డ్ అధికారి మనోహరరెడ్డి, లెఫ్టినెంట్ రోహిణి, కుసుమ, పీఈ సిద్ధార్థ, కళాశాల ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ ఎస్‌కె రఫియ, నలంద కళాశాల ఎన్‌సీసీ యూనిట్లు పాల్గొన్నారు.

మైనర్ల డ్రైవింగ్‌పై చర్యలు తీసుకోవాలని వినతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలో మైనర్లు డ్రైవింగ్ చేయకుండా తగు చర్యలు తీసుకోవాలంటూ అయోధ్యనగర్‌కు చెందిన జయహో సర్వీసెస్ అండ్ ట్రాఫిక్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు కొల్లా జయశ్రీ శనివారం ట్రాఫిక్ ఏసీపీకు వినతి పత్రం అందజేశారు. మైనర్లు డ్రైవింగ్ చేయటం వల్ల ఎప్పుడు ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగించాల్సి వస్తుందని వినతి పత్రంలో పేర్కొన్నారు. తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వటంతో పాటు మైనర్లు డ్రైవింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని ఆమె వినతి పత్రంలో కోరారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సింగ్‌నగర్, వాంబేకాలనీ పరిధిలో గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు నగర పోలీసు కమిషనర్‌కు సమాచారం అందిందన్నారు. ఆయన సమాచారం మేరకూ పోలీసులు వాంబేకాలనీ ఎక్సెల్‌ప్లాంట్ వద్ద తనిఖీలు చేపట్టమన్నారు. షేక్ యాకోబ్ షరీఫ్(25) అనే వ్యక్తి ఎక్సెల్‌ప్లాంట్ వెంబడి నూతనంగా నిర్మించిన జీప్లస్‌త్రీ నివాసాల వద్ద అనుమానస్పదంగా కనిపించాడని చెప్పారు. అతడిని అదుపులోకి తీసుకొని పోలీసులు తనిఖీలు చేయగా అతగాడి వద్ద రెండు కేజీల గంజాయి లభించిందన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టు ఎదుట హాజరుపరచగా కోర్టు అతనికి రిమాండ్ విధించింది.

21న భవానీద్వీపంలో మాతృభాషా దినోత్సవం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఈనెల 21న ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, తెలుగు, సంస్కృత అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో భవానీ ద్వీపం నందు హంపి థియేటర్‌లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తొలి తెలుగు దివ్వె తెలుగు మూలాల అధ్యయన సంఘం వ్యవస్థాపకులు పీవీఎల్ఎన్ రాజు(అబ్బు) ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకల్లో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖామంత్రి జోగి రమేష్, ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు, అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు, తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి, ఇతర ప్రముఖులు హాజరవుతారన్నారు. ఈ వేడుకల్లో భాగంగా శాసన పరిశోధకులు, చారిత్రక రచయితలను సత్కరించనున్నట్లు ఆయన తెలిపారు. తెలుగు జాతీయులు, తెలుగు భాషాభిమానులు ఈ వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బొమ్మరిల్లు కవితా సంపుటి ఆవిష్కరణ



విజయవాడ కల్చరల్: నవ్యాంధ్ర రచయితల సంఘం ఆధ్వర్యంలో సీనియర్ జర్నలిస్ట్ ఘంటా విజయకుమార్ ఛాయాచిత్రలతో కూడిన బొమ్మరిల్లు కవితా సంపుటిని కృష్ణవేణీ నదీ తీరాన శనివారం గాంధీ దేశం ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఆర్ ఆర్ నాగరాజన్ గాంధీ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కవితా సంపుటిలో అరుదైన ఛాయాచిత్రలతో పాటు వాటికి సంబంధించిన కవితాంశం ఉందని కవి విజయకుమార్ అనేక సామాజిక అంశాలను ప్రస్తావించారన్నారు. నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ మాట్లాడుతూ కృష్ణవేణి తీరాన ఏమాత్రం హంగులు ఆర్భాటాలు లేకుండా కవితా సంపుటి ఆవిష్కరణ జరగడం శుభపరిణామని తెలిపారు. రచయిత డాక్టర్ ఘంటా విజయకుమార్ కవితా సంపుటికి ప్రేరణకలిగించిన అంశాలను వివరించారు. ఆవిష్కరణ సభలో జర్నలిస్ట్ కుర్రా సురేష్ బాబు, గాంధీదేశం ట్రస్ట్ బాధ్యులు భారతి పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనలో చేతిరాత కీలకం



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేసిన జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థుల విద్యాభివృద్ధికి, ఉత్తమ ఫలితాల సాధనలో చేతిరాతే కీలకమని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. ప్రాథమిక స్థాయి నుంచి చేతిరాతపై పట్టు సాధించేలా పిల్లలను ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేతిరాతలో శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకోనున్నామని కలెక్టర్ తెలిపారు. హ్యాండ్ రైటింగ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులకు జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు శనివారం ఆయన కార్యాలయంలో ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేతిరాత నిపుణుడు భువనచంద్ర సహకారంతో శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాకు సంబంధించి ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 170 మంది విద్యార్థులు పాల్గొనగా ఉన్నత స్థాయిలో ఎస్.జీవితేష్, అవ్యక్తా, ప్రద్యుమ్నా పూజారి ప్రాథమిక స్థాయిలో జి.జ్ఞాన శ్రీనిధి లు చాంపియన్ షిప్ సాధించడం జిల్లాకు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో జాతీయ చేతిరాత నిపుణుడు పి.భువనచంద్ర, అమలి, శుభోదయ పాఠశాలల ప్రిన్సిపాల్స్ వై.రాజకుమారి, బి.శైలజ, అధ్యాపకులు సీహెచ్.నళిని, ఎం.శ్యామ్ కుమార్, ఎం.కె.ఎస్తేరు, పద్మజ్యోతి, ఎ.భావన, జి.జ్ఞానేశ్వరి, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆది దేవునికి అఖండ నాదార్చన



వాగ్గేయకార కృతులను గానం చేస్తున్న తులసి

విజయవాడకల్చరల్: స్వరఝరి సంగీత సంస్థ ఆధ్వర్యంలో మహాశివరాత్రి సందర్భంగా గవర్నర్‌పేటలోని సీతారామా కల్యాణమండంలో శనివారం నిర్విరామ నాదార్చన కార్యక్రమం నిర్వహించారు. 12 గంటల పాటు సాగిన కార్యక్రమంలో వాగ్గేయకారులు రచించిన శివ భక్తి గీతాలను నగరానికి చెందిన పలువురు సంగీత విద్వాంసులు మధురంగా గానం చేశారు. ప్రముఖ సంగీత విద్వాంసులు, మోదుమూడి సుధాకర్, కె.బ్రహ్మానందరావు, పోవూరి గౌరీనాథ్, వేమూరి విశ్వనాథ్, విష్ణుభొట్ల సోదరీమణులు, యువ సంగీత కళాకారులు లంక తేజస్విని, ఎం. హిమబిందు, చింతలపాటి మంజుల, శివలెంక విశ్వనాథ్‌తోపాటు అనేక మంది భక్తి సంకీర్తనలను ఆలపించారు. పాలపర్తి నాగేశ్వరరావు, బీవీ దుర్గాభవాని, బీవీఎస్ ప్రసాద్ కళాకారులకు వాద్య సహకారం అందించారు. స్వరఝరి సంస్థ ప్రధాన కార్యదర్శి మోదుమూడి సుధాకర్ మాట్లాడుతూ 12 ఏళ్లుగా అఖండ నాదార్చన కార్యక్రమం నిర్వహిస్తునట్లు తెలిపారు. కళాపోషకుడు బొగ్గవరపు రామకృష్ణ కార్యక్రమాలను ప్రారంభించారు.

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ




ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మహా శివరాత్రి నేపథ్యంలో పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఇంద్రకీలాద్రికి చేరుకుని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచి భక్తుల రద్దీ కొనసాగగా, మధ్యాహ్నం మహా నివేదన అనంతరం మరింత భక్తుల రద్దీ పెరిగింది. కళాశాలలకు వరస సెలవుల కావడంతో విద్యార్థులు స్నేహితులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మహా శివరాత్రి నేపథ్యంలో గతంలో ఎన్నడూ లేని రీతిలో ఆలయ ప్రాంగణంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. అమ్మవారి ఆలయంతో పాటు మల్లేశ్వరాలయం, మహా మండపం, ఘాట్‌రోడ్డు, కనకదుర్గనగర్‌లను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ప్రధాన ఆలయాన్ని శనివారం ఆలయ అర్చకులు తెరిచి పూజా కార్యక్రమాలను నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయాభివృద్ధి పనులు జరుగుతున్న సంగతి విధితమే. పనుల నిమిత్తం స్వామి వారి ఆలయాన్ని కొన్ని నెలలుగా మూసివేయగా, మహాశివరాత్రి నేపథ్యంలో ఆలయ ద్వారాలు తెరిచి స్వామి వారికి పూజా కార్యక్రమాలను నిర్వహించిన పిమ్మట భక్తులను దర్శనానికి అనుమతించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని బాలాలయంలో స్వామి వారికి త్రికాల అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

నేడు కెనాల్‌రోడ్డులో రథోత్సవం

153 ఏళ్లుగా నిర్వహణ



కనులపండువగా రథోత్సవం (ఫైల్)

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ కన్యకా పరమేశ్వరి అన్నసత్రం కమిటీ ఆధ్వర్యంలో ప్రతి ఏటా జరిగే మల్లేశ్వరుని రథోత్సవం నగరానికి తలమానికంగా నిలుస్తోంది. కేవలం నగర వాసులే కాకుండా చుట్టు పక్కల గ్రామాల నుంచి వేలాది మంది ఈ రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు తరలివస్తుంటారు. ఈ రథోత్సవంలో మూడు ఆలయాలకు చెందిన ఉత్సవ మూర్తులు కెనాల్ రోడ్డులో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేస్తుంటారు. దుర్గగుడి, పాత శివాలయం బుద్దువారి గుడిలకు చెందిన ఉత్సవమూర్తులను ఈ రథంపై అధిష్ఠింపజేస్తారు. శ్రీకన్యకా పరమేశ్వరి అన్నసత్రం కమిటీ గడిచిన 153 సంవత్సరాలుగా ఈ రథోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. వన్‌టౌన్ రహదారులన్ని జాతరను తలపించే విధంగా దుకాణాలతో దర్శనమిస్తాయి. ప్రధానంగా గ్రామాల్లో జరిగే తిరునాళ్లు, సంత వాతావరణాన్ని ఈ రథోత్సవం ఆవిష్కరిస్తుంది. ఈ ఏడాది మరింత దేదీప్యమానంగా రథోత్సవాన్ని నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నారు.

కెనాల్‌రోడ్డులో భక్తులకు కనువిందు

దుర్గగుడి, బుద్దు వారి గుడి, పాతశివాలయానికి పూర్వం ఆర్థిక వనరులు ఉండేవి కావు. ఆ సమయంలో శ్రీ కన్యకాపరమేశ్వరి అన్నసత్రం కమిటీ శివరాత్రి ఉత్సవాలను నిర్వహించేవారు. ఆ తరువాత ఈ మూడు ఆలయాలకు సంబంధించిన ఉత్సవ మూర్తులతో రథోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని ఆ కమిటీ ప్రముఖులు చెబుతున్నారు. అయితే నేడు దుర్గగుడికి ఆదాయ వనరులు పెరగటంతో మూడున్నర దశాబ్దాలుగా దుర్గగుడి అధికారులే కొండపైన కల్యాణోత్సవాలను నిర్వహిస్తున్నారు. అయితే పాతశివాలయంలో ఇప్పటికీ కన్యకా పరమేశ్వరి అన్నసత్రం కమిటీ ఆధ్వర్యంలోనే కల్యాణోత్సవాలు కొనసాగుతున్నాయి. రథోత్సవంలో మాత్రం మూడు ఆలయాల ఉత్సవమూర్తులు ఊరేగుతున్నాయి. కెనాల్ రోడ్డులోని రథం సెంటర్ నుంచి ఆదివారం సాయంత్రం రథోత్సవాన్ని నిర్వహించేందుకు కమిటీ ప్రముఖులు ఏర్పాట్లు చేస్తున్నారు. విజయవాడ కమిషనరేట్ పోలీసు కమిషనర్ కొబ్బరికాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించడం కూడా రెండు దశాబ్దాలుగా కొనసాగుతుందని నిర్వాహకులు చెబుతున్నారు. అలాగే పలు జాదపద కళాకారుల విన్యాసాలతో, వేద పండితుల మంత్రోచ్ఛరణలతో ఆదిదంపతులు కృష్ణానది ఒడ్డున ఉన్న కెనాల్‌రోడ్డులో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేయనున్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

కృష్ణలంక(విజయవాడతూర్పు): భార్యభర్తల మధ్య గొడవజరగడంతో భర్త కనిపించకుండా పోయిన ఘటనపై కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కృష్ణలంక, భ్రమరాంబపురానికి చెందిన కొమర లక్ష్మీనరసయ్య గుంటూరు జిల్లా తాడేపల్లిలో ప్లైవుడ్ డోర్స్ షాపు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో అతనికి ఒక మహిళతో వివాహేతర సంబంధం ఉందని అతని భార్య తరచూ గొడవపడుతుండేది. ఈ నేపథ్యంలో శనివారం ఇద్దరి మధ్య గొడవ జరగడంతో ఇంటిలో నేనుండను వెళ్లిపోతానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కన, బంధువుల ఇళ్లలో వెతికినా అతని ఆచూకీ లభించలేదు. తన కుమారుడు కనిపించలేదని తండ్రి వీరయ్య ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పుణ్యస్నానాలకు పోటెత్తిన భక్తజనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మహాశివరాత్రి పుణ్యస్నానాలకు విచ్చేసిన భక్తజనంతో కృష్ణానది తీరంలోని స్నానఘాట్లు కిటకిటలాడాయి. దుర్గాఘాట్ తెల్లవారుజామున 3 గంటల నుంచే భక్తులు పుణ్యస్నానాలకు తరలివచ్చారు. ప్రకాశం బ్యారేజీ నుంచి దుర్గాఘాట్ వరకు భక్తులు బారులు తీరి కనిపించారు. స్నానఘాట్‌లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా దుర్గగుడి అధికారులు మైక్ ప్రచార కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తెల్లవారుజామున ఆరు గంటల నుంచి పుణ్యస్నానాలు ఆచరించే భక్తుల సంఖ్య మరింత పెరిగింది. దీంతో స్నానఘాట్‌లోకి భక్తులను పరిమిత సంఖ్యలో అనుమతిస్తూ రద్దీని నియంత్రించారు. మరో వైపున స్నానఘాట్ ప్రధాన గేటు నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు భక్తులు క్యూలైన్‌లో వేచి ఉండేందుకు కంపార్టుమెంట్ పద్ధతిని పోలీసులు అనుసరించారు. పుణ్యస్నానాలకు విచ్చేసిన భక్తుల రద్దీ నేపథ్యంలో ట్రాఫిక్‌ను మళ్లించారు. వీఐపీ ఘాట్, పున్నమి ఘాట్, నదీ తీర ప్రాంతాల్లో పిండప్రదానాలు, బంగన్న దొరల సందడి కనిపించింది. పలువురు ప్రముఖులు, నగర వాసులు పితృదేవతలకు పిండప్రదానం చేశారు.

వైవీ రావు మృతి తీరని లోటు

బస్టాండ్(విజయవాడపశ్చిమ): ఆర్టీసీ కార్మిక నేత వైవీ రావు మృతి తీరని లోటని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు అన్నారు. శుక్రవారం రాత్రి హఠాన్మరణం చెందిన వైవీ రావు కుటుంబాన్ని ఎండీ పరామర్శించి అంతిమ యాత్రలో పాల్గొన్నారు..